సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 21 । జూలై । 2024



స్కూల్ తనిఖీ చేసిన డీఈవో

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండెపల్లి ప్రభుత్వ పాఠశాలను డీఈవో రమేశ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించారు.



మిడ్‌మానేరులో 5 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టులో నీటినిల్వ 5.575 టీఎంసీలకు చేరింది. శనివారం ప్రాజెక్టులోకి 115 క్యూసెక్కుల మేర స్వల్ప వరద ఇన్‌ఫ్లోగా వస్తోంది.

గరిష్ఠం/కనిష్ఠం
27.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో ముసురువర్షం కురుస్తుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం



సిరిసిల్ల: కార్మికక్షేత్రంలో శనివారం 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట'లో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. పిల్లలను అంగన్‌వాడీకి సిద్ధం చేసి, వారిపై బోనం ఎత్తి అంగన్‌వాడీ కేంద్రానికి ఆహ్వానించారు. అంగన్‌వాడీ కేంద్రంపై పిల్లల్లో ఆసక్తి కలిగేలా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలతో పోచమ్మబోనం తీసి సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. గణేశ్‌నగర్ అంగన్‌వాడీ టీచర్ జి.వింధ్యారాణి, తుక్కరావుపల్లె అంగన్‌వాడీ టీచర్ ఎం.శిరీష, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే బీఆర్ఎస్ ఆరోపణలు

- కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్



మాట్లాడుతున్న చొప్పదండి ప్రకాశ్

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తుందని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుంటే బీఆర్ఎస్ వాళ్లు కళ్లు, చెవులు మూసుకుని ఉంటున్నారన్నారు. పదేళ్లలో గత ప్రభుత్వం చేసిందేమి లేదని విమర్శించారు. ఇన్నేళ్లుగా బీఆర్ఎస్ రైతులకు ద్రోహం చేస్తూ వచ్చిందన్నారు. ఆరుల నెలల్లోనే రైతు రుణమాఫీ రూ.32వేల కోట్లు మాఫీ చేస్తుంటే బీఆర్ఎస్, బీజేపీలు జీర్ణించుకోలేక అవాక్కులు, చవాక్కులు పేలుతున్నారన్నారు. టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, యెల్లె లక్ష్మీనారాయణ, నర్సయ్య, పర్శరామ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



అన్వేశ్, వేములవాడ మున్సిపల్ కమిషనర్

- పకడ్బందీగా పారిశుధ్య పనులు
- కుక్కల బెడదను నివారిస్తాం
- ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి
- సిరిసిల్ల, వేములవాడ కమిషనర్‌లు డి.లావణ్య, అన్వేశ్
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో ప్రజల సమస్యలకు పరిష్కారమార్గాలు

సిరిసిల్లటౌన్/వేములవాడ: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా బల్దియా ఆధ్వర్యంలో పకడ్బందీగా పారిశుధ్య పనులు చేయిస్తున్నట్లు సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్‌లు డి.లావణ్య, అన్వేశ్ పేర్కొన్నారు. 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫోన్‌ఇన్‌లో పలు వార్డుల ప్రజలు తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజలు తెలిపిన సమస్యలను నోట్ చేసుకున్న కమిషనర్‌లు పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులకు ఆదేశాలిచ్చారు. త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పౌరులు సైతం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఫోన్‌లో ప్రజలు తెలిపిన సమస్యలకు పలు పరిష్కార మార్గాలు చూపారు. ఆ వివరాలు యథాతథంగా..



డి.లావణ్య, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్

ప్రశ్న : వేములవాడలో కుక్కల భయం ఉంది. ఇప్పటికే చాలా మందిపై దాడి చేశాయి. వాటి నివారణ చర్యలు తీసుకోండి.

– దేవయ్య, ముద్రకోల రాములు, ఎం.శ్రీధర్, సంతోష్, శ్రీశైలం–వేములవాడ

కమిషనర్ : కుక్కల సమస్య తీవ్రమైంది. త్వరలోనే కుక్కలను పట్టేవాళ్లను తీసుకొచ్చి దూర ప్రాంతాలకు తరలిస్తాం. ఈమేరకు ఇటీవల పాలకవర్గం నిర్ణయించింది.

ప్రశ్న : ఖాళీ స్థలాల్లో చెత్త, పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయి. పాముల భయం ఉంది.

– సంతోష్, గజ్జెల ముత్యం, మేరుగు స్వామి, ప్రశాంత్

కమిషనర్ : స్థల యజమానులను గుర్తించి, నోటీసులు ఇస్తాం. ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలను తొలగించి చెత్త లేకుండా చూస్తాం.

ప్రశ్న : డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదు. చెత్తబండ్లు సకాలంలో రావడం లేదు.

– రాజు, శివప్రసాద్, జాగిరి సురేశ్, డి.అప్పారావు. దుర్గం పర్శరాం(వేములవాడ), శ్రీనివాస్‌రెడ్డి–కోనాయపల్లి

కమిషనర్: శానిటేషన్ సిబ్బందితో డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తాం. చెత్త బండ్లు రెగ్యులర్‌గా వచ్చేలా చొరవ తీసుకుంటాం.

ప్రశ్న : మార్కండేయనగర్, నందీశ్వర కమాన్ వద్ద మురికినీరు నిలుస్తుండడంతో ఇబ్బందిగా ఉంది.

– డాక్టర్ అనిల్, నాగరాజు, వేముల భాస్కర్, పద్మ, వంగల కర్ణ, శ్రీధర్, అశోక్ – వేములవాడ

కమిషనర్ : తప్పకుండా శానిటేషన్ సిబ్బందిని పంపించి మురికినీరు నిల్వకుండా చూస్తాం. మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి పైప్‌లైన్ లీకేజీను సరిచేయిస్తాం. నందీశ్వర కమాన్ ఏరియా ఆలయ పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో ఉంది. రెండు డిపార్ట్‌మెంట్లు సంయుక్తంగా మీ సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న : రోడ్లు బాగాలేవు, బురద పేరుకుపోతుంది.

– రమేశ్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, సునీత, లయశ్రీ, అనుష్క, లత(వేములవాడ), ప్రభాకర్–శాత్రాజుపల్లి, మోహన్ –అయ్యోర్‌పల్లి

కమిషనర్ : పిచ్చిమొక్కలను సత్వరమే తొలగించి ఇబ్బందులు లేకుండా చూస్తాం. బురదగుంతల్లో మట్టి పోయిస్తాం. మిగిలిన మట్టి రోడ్ల స్థానంలో సీసీ రోడ్లు వేయిస్తాం.

ప్రశ్న : కూలిపోయిన ఇళ్లు, పాత ఇళ్లు, ఖాళీ స్థలాలతో ఇబ్బందిగా ఉంది.

– రేగుల సంతోష్‌బాబు, చిట్టి సంతు–వేములవాడ

కమిషనర్ : కూలిన ఇళ్లు, పాత ఇళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చాం. ఖాళీ స్థలాలను శుభ్రం చేయిస్తాం.

ప్రశ్న : మల్లారం జంక్షన్ పెద్ద సమస్యగా మారింది. తిప్పాపూర్ పోచమ్మ వద్ద అన్నీ సమస్యలు ఉన్నాయి.

– సుదర్శన్‌రెడ్డి, నిఖిల్, ప్రశాంత్, వినోద్, బాబు, ఆలూరి మమతారెడ్డి, షఫీ, సాగర్–వేములవాడ

కమిషనర్ : మా సిబ్బందిని పంపించి మట్టి డ్రెయినేజీలను వెడల్పు చేయిస్తాం. పెరిగిన మొక్కలను తొలగిస్తాం. కట్టుకాల్వ పనులు ముందుకుసాగేలా చొరవ తీసుకుంటాం. తిప్పాపూర్ పోచమ్మ వద్ద అన్ని సమస్యలు పరిష్కరిస్తాం.

సాక్షి ఫోన్ ఇన్

ప్రశ్న : కూరగాయల మార్కెట్లో రోడ్లపైనే గోవులు సంచరిస్తున్నాయి. – రేణికింది అశోక్, పాషా–వేములవాడ

కమిషనర్: వేములవాడలోని కూరగాయల మార్కెట్లో సంచరించే గోవులను వెంటనే గోశాలకు తరలిస్తున్నాం.

ప్రశ్న : కోనోకార్పస్ చెట్లతో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

– రేగుల మల్లికార్జున్, భూమేశ్, రాజు

కమిషనర్ : ఈ చెట్లపై అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఉన్నతస్థాయి అధికారుల సూచనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: సిరిసిల్లలో పందుల బెడద ఎక్కువగా ఉంది. బురద రోడ్లపై మొరం పోయించండి. బ్లీచింగ్ చల్లడం లేదు.

– బిక్కునాయక్– 2వ వార్డు, అరవింద్–శ్రీనగర్, ఎలిగేటి రాజశేఖర్–33వ వార్డు

కమిషనర్: వర్షాకాలం కాబట్టి చల్లిన బ్లీచింగ్ ఎప్పటికప్పుడు పోతుంది. అన్ని వార్డుల్లో శానిటేషన్ డ్రైవ్ చేపడతాం. అవసరమైన చోట్ల బురదరోడ్లపై మొరం పోయిస్తాం. పందులను వెంటనే తరలించాలని పెంపకందార్లను ఆదేశిస్తాం. పారిశుధ్య పనులు మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మా ఏరియాలోని ఓపెన్‌ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరిగి దోమలకు ఆవాసాలుగా మారాయి.

– రమణ–తారకరామానగర్, విజయ్‌కుమార్–కేసీఆర్‌నగర్

కమిషనర్: ఓపెన్‌ప్లాట్ల యజమానులకు నోటీస్‌లు అందిస్తున్నాం. డ్రెయినేజీల్లో ఆయిల్‌బాల్స్ వేయిస్తాం. ఫాగింగ్‌మిషన్‌ను అన్ని వార్డుల్లో తిప్పుతాం. ప్రతీవారం డ్రైడే పాటిస్తే మంచిది. ఓపెన్‌ప్లాట్లకు పన్ను అంశం మా పరిధిలో లేదు.

ప్రశ్న: చిన్నవానకే మోకాలు లోతు నీరు నిలుస్తుంది. ఏళ్లుగా ఈ సమస్య తీరడం లేదు. మోరీల నుంచి వరద నీరు నివాసాల్లోకి వస్తుంది.

– గాజుల చంద్రశేఖర్–సర్దార్‌నగర్, అంకం కుమార్–సంజీవయ్యనగర్, అన్నల్‌దాస్ గణేశ్–39వ వార్డు

కమిషనర్: పాతబస్టాండు, వెంకంపేట, సంజీవయ్యనగర్, సర్దార్‌నగర్, శ్రీనగర్ వంటి లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు రోడ్లపైకి రాకుండా చేసేందుకు ప్రతిపాదనలు పూర్తయ్యాయి. రూ.2.50 కోట్లు వెచ్చించి డ్రెయినేజీలు నిర్మిస్తాం. రోడ్ల పనుల అనుమతుల కోసం కౌన్సిల్ తీర్మానించి, ప్రభుత్వానికి నివేదిస్తాం.

ప్రశ్న: వర్షాలకు పిచ్చిచెట్లు రోడ్లపై పెరిగాయి. పాములు, తేళ్లు తిరుగుతున్నాయి. డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదు. మోరీల్లో ప్లాస్టిక్ బాటిల్స్ వేస్తుంద్రు.

– కొండ ప్రభాకర్–శాంతినగర్, ప్రసాద్–బీవైనగర్(సిరిసిల్ల)

కమిషనర్: స్వచ్ఛ సిరిసిల్లలో ప్రజలు కూడా బాధ్యతతో ఉండాలి. మోరీల్లో ప్లాస్టిక్, ఇతర చెత్తను పాడేయొద్దు. రోడ్ల వెంట మొక్కల్ని తీసేయిస్తాం. డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయిస్తాం.

ప్రశ్న: వీధుల్లో కుక్కలతో భయం భయంగా ఉంటున్నాం. పిల్లలను బయటకు పంపాలంటే భయంగా ఉంది.

– యాదగిరి–13వ వార్డు, రాజభాను ప్రకాశ్‌రెడ్డి–రాళ్లబావి, కోడం కనకయ్య–పద్మనగర్

కమిషనర్: పట్టణంలో చాలా ఏరియాల నుంచి కుక్కల బెడదపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఇప్పటికే బ్లూక్రాస్ ప్రతినిధులతో కుక్కలకు వ్యాక్సినేషన్ చేయించాం. ఫ్యామిలీ ప్లానింగ్ చేయించడంపై చర్చించాం. కుక్కలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చూస్తాం.

ప్రశ్న: మా కౌన్సిలర్ పట్టించుకోవడం లేదు. కాలనీలో రోడ్లు లేవు. మోరీలు కట్టిస్తలేరు. ఇళ్ల ముందు నీళ్లు ఆగాయి. పాముల భయం ఉంది.

– సిద్దు–7వ వార్డు, సుల్తాన్ రమణ–శ్రీనగర్‌కాలనీ

కమిషనర్: అయ్యప్ప ఆలయ పరిసరాల కాలనీల్లో కొత్తగా రోడ్లు, మోరీలు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాం. 39 వార్డుల్లో మొత్తంగా 250 పనులుగా విభజించి రోడ్లు, మోరీలు, ఇతర అభివృద్ధి పనులు చేపడతాం. విలీన గ్రామాల్లో రూ.3కోట్లతో వసతుల కల్పనకు కృషిచేస్తున్నాం. శ్రీనగర్‌కాలనీ వాటర్ ట్యాంకుల వద్ద కరెంటు మోటార్లను రిపేరు చేయిస్తాం.

ప్రశ్న: ఏళ్లనాటి పెంకుటిళ్లు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వర్షాకాలం కావడంతో భయంగా ఉంది. టౌన్‌ప్లానింగ్‌లో ఫిర్యాదు చేశాం. చర్యలు తీసుకోవాలి.


– ప్రయాకర్‌రావు వేణు–హెడ్ పోస్టాఫీస్ వీధి, వెంకటరమణ–రామాలయంవీధి

కమిషనర్: సిరిసిల్లలో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న 40కి పైగా నిర్మాణాలను గుర్తించాం. ఆయా ఇళ్ల యజమానులకు నోటీసులు పంపిస్తున్నాం. మీ ఏరియాలోని పెంకుటిల్లు యజమానితో ఇప్పటికే మాట్లాడగా.. మూడు రోజుల్లో రిపేరు చేయిస్తామన్నారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటాం. పట్టణంలో కుక్కలు, పందుల బెడద తప్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు భయపడొద్దు.


షరతులు వర్తిస్తాయి

- రేషన్‌కార్డు, ఆధార్ లింకేజీ, పీఎం కిసాన్ ప్రామాణికం
- రుణాలు ముందే చెల్లించినా, రీషెడ్యూల్ చేసుకున్నా వర్తించని వైనం
- మిగిలిన అవుట్ స్టాండింగ్ రుణం మాత్రమే మాఫీ
- అర్హులైనా తమకు మాఫీ కాలేదని రైతుల ఆవేదన
- బ్యాంకులు, రైతు వేదికలకు బారులు తీరిన అన్నదాతలు
- మళ్లీ దరఖాస్తు చేస్తే వర్తింపజేస్తామని సూచన

సాక్షిప్రతినిధి, కరీంనగర్: రైతు రుణమాఫీ విషయంలో అర్హులకు అన్యాయం జరిగిందని విమర్శలు వినిపిస్తున్న వేళ.. అధికారులు పలు కొత్త కారణాలు చెబుతున్నారు. రేషన్‌కార్డు ప్రామాణికం కాదని చెప్పినప్పటికీ.. వాస్తవానికి కుటుంబాల గుర్తింపులో వాటినే ప్రామాణికంగా తీసుకున్నారని అధికారులే చెబుతుండటం గమనార్హం. మరోవైపు.. రూ.లక్షలోపు రుణం తీసుకున్న వారిలో ఉమ్మడి జిల్లాలో 1.24 లక్షల మందికి రుణం మాఫీ కాగా.. వాస్తవానికి గత ప్రభుత్వంలో ఈసంఖ్య 3 లక్షలు దాటి ఉంది. వారిలో మిగిలిన వారంతా తమకు ఎందుకు రుణమాఫీ కాలేదని దాదాపుగా రెండు లక్షల మంది కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో శనివారం ఉదయం నుంచే రైతువేదికలు, బ్యాంకులకు పోటెత్తారు.అక్కడ అధికారులు చెప్పిన కారణాలు విని కొందరు రుణమాఫీపై ఆశలు వదులుకోగా.. మిగిలిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.



ఆన్‌లైన్‌లో రుణమాఫీ స్టేటస్



6	7	8
31030		మంజూరు అయిన రుణం కన్నా 9.12 నాటికి బకాయి ఉన్న వడ్డీ ఎక్కువగా
31030		

ఆన్‌లైన్‌లో రుణమాఫీ స్టేటస్

అసలేంటి ఆ కారణాలు?

- వాస్తవానికి ప్రభుత్వం ఆదినుంచీ చెబుతున్నట్లు తాను విధించిన నిబంధనల మేరకు మాఫీ చేసింది.
- అందులో మొదటగా.. కాలపరమితి 12–12–2018 నుంచి 09–12–2023 మధ్య రుణం తీసుకుని ఉండాలి. అలా కాకుండా అంతకుముందు, ఆ తర్వాత తీసుకున్న వారికి రుణమాఫీ కాలేదు.
- ఐదేళ్లలో పంట రుణం తీసుకుని మొత్తాన్ని(రుణవాయిదా) బ్యాంకులకు చెల్లిస్తే.. ఆ రుణాలకు మాఫీ వర్తించదు.
- 09–12–2023 నాటికి లోను ఖాతాలో ఉన్న అవుట్ స్టాండింగ్ అమౌంట్ ఎంత ఉంటే అంత మాత్రమే మాఫీ అయింది. ఉదాహరణకు రూ.లక్ష రుణం తీసుకున్న వ్యక్తి పేర్కొన్న తేదీ 09–12–2023 నాటికి రూ.50 వేలు చెల్లించాడనుకుందాం.. అతనికి ఇపుడు కేవలం రూ.50 వేలు మాత్రమే మాఫీ అవుతుంది. వీరు తమకు రూ.లక్షకు బదులు రూ.50 వేలే మాఫీ అయ్యాయని వాపోతున్నారు.



- రేషన్‌కార్డు లేనివారికి రుణాలు మాఫీ కాలేదు. ప్రభుత్వం పాసుబుక్కులు ప్రామాణికమని చెప్పినప్పటికీ.. క్షేత్రస్థాయిలో అది పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. రేషన్‌కార్డులో సభ్యులు కానివారు, రేషన్‌కార్డులో పేరు ఉండి వారి ఆధార్ లింక్ లేకపోయిన వారికి రుణం మాఫీ కాలేదు.
- రుణం తీసుకుని, చెల్లించేందుకు వీలుగా రీ షెడ్యూల్ చేసుకున్న వారికి కూడా రుణమాఫీ వర్తించలేదు.
- వీటితోపాటు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వర్తించని వారికి కూడా రుణమాఫీ అవలేదు. ఈ కారణాల ఫలితంగా ఉమ్మడి జిల్లాలో దాదాపు 2 లక్షల మందికిపైగా రైతులు రుణమాఫీకి దూరంగా ఉన్నారని సమాచారం.
- గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో తొలిదఫాలో 3,77,984 మంది రైతులకు రూ.1,693.52కోట్లు మాఫీ చేసింది. రెండోసారి దశల వారీగా 3,73,213 మందికి రూ.1,191కోట్లు రద్దు చేసింది. ప్రస్తుతం రుణమాఫీలో ఉమ్మడి జిల్లాలో 1,24,167 మందికి రూ.688.42 కోట్లు మాఫీ అయ్యింది. ఈ లెక్కన చూసినపుడు దాదాపు 2.50 లక్షల మంది రైతులు రుణమాఫీకి దూరంగా ఉన్నారని సమాచారం.

మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు



పలు కారణాలతో కొందరు రైతులకు రుణమాఫీ కాలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం కాకుండా.. అర్హత ఉండి, మాఫీ కాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకునే వీలుంది. ప్రభుత్వం నిబంధనలు ప్రకారం వారికి రుణమాఫీ చేస్తుంది.

– శ్రీనివాస్, డీఏవో, కరీంనగర్

రుణమాఫీ కాలేదు



నాకున్న ఇరవై గుంటలపై 2020లో ఆంధ్రాబ్యాంక్(యూనియన్ బ్యాంక్) క్రాఫ్ లోన్ రూ.20వేలు ఇచ్చారు. కానీ, నాకు రుణమాఫీ కాలేదు. బ్యాంకర్లను అడిగితే లిస్ట్‌లో పేరు రాలేదంటున్నారు. ఇదెక్కడి న్యాయం? కూలీనాలీ చేసుకొని బతుకుతున్న నాకే రుణమాఫీ కాలేదంటే ఎట్లా? రూ.లక్షలోపు రుణమాఫీ చేశామని సీఎం చెప్పుతుండు. కానీ.. మాలాంటి రైతులకు ఎంతో మందికి రుణమాఫీ కాలేదు.

– కూచనపల్లి రాజు, రైతు, వీణవంక

పాస్‌పుస్తకంతో తీసుకున్న



ఒకేదఫాలో పంటరుణం మాఫీ చేస్తామని ప్రభుత్వం అంది. నాకున్న భూమి పట్టాపాసు పుస్తకం పెట్టి బ్యాంక్‌లో రూ.64 వేలు పంట రుణం తీసుకున్న. ప్రభుత్వం మొదట లక్ష రూపాయలు లోన్ ఉన్న వారికి మాఫీ చేస్తామని చెప్పింది. నాకు రేషన్ కార్డు, పాస్ పుస్తకం ఉన్నా లోన్ మాఫీ కాలేదు. అధికారులను అడిగితే నా పేరుకు బదులు మరొకరి పేరు ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నరు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– వీరగోని శ్రీనివాస్, కాట్నపల్లి



ముసురుకుంది

సిరిసిల్ల/వేములవాడ: జిల్లాలో శనివారం వాన ముసురుకుంది. శుక్రవారం రాత్రికి మొదలైన ముసురువాన రెండు రోజులుగా కురుస్తూనే ఉంది. ఇల్లంతకుంటలో అత్యధికంగా 4.4 మిల్లీమీటర్లు, రుద్రంగిలో 3.8, చందుర్తిలో 2.6, వేములవాడరూరల్‌లో 3.4, బోయినపల్లిలో 4.1, వేములవాడలో 4.2, సిరిసిల్లలో 3.6, కోనరావుపేటలో 2.5, వీర్నపల్లిలో 2.0, ఎల్లారెడ్డిపేటలో 2.4, ముస్తాబాద్‌లో 2.5, గంభీరావుపేటలో 2.3, తంగళ్లపల్లిలో 1.6 మిల్లీమీటర్ల వర్షం పడింది.

క్లుప్తంగా

నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలు



నవోదయ విద్యాలయం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025–26 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో దూస రఘుపతి కోరారు. ఎల్లారెడ్డిపేట ఎమ్మార్సీలో శనివారం మాట్లాడారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దీనికి అర్హులన్నారు. సెప్టెంబర్ 16 వరకు విద్యార్థులు దరాఖాస్తు చేసుకోవాలన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 3 నుంచి 5వ తరగతి వరకు చదివి ఉండాలన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారికి జనవరి 18న ప్రవేశపరీక్షల ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లితండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతు రుణమాఫీపై ఆరోపణలు అర్థరహితం


సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకుంటే బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం అర్థరహితమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేటలోని పార్టీ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. డీసీసీబీ అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అర్థం లేని విమర్శలు చేయడంపై జిల్లా రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15 లోపు పూర్తి స్థాయిలో రూ.2 లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, లింగంగౌడ్, సాహెబ్, శ్రీనివాస్‌రెడ్డి, ఇమామ్, సుధాకర్‌గౌడ్ సత్యనారాయణ, కార్తీక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి


సమావేశంలో జేఏసీ నాయకులు

వేములవాడఅర్బన్: గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ ధూంధాం కళాకారులను అన్ని విధాలుగా మోసం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కళాకారుల కుటుంబాలను ఆదుకోవాలని కళాకారుల జేఏసీ కమిటీ చైర్మన్ ఎల్లా పోశెట్టి కోరారు. వేములవాడలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన వృద్ధ కళాకారులను గుర్తించి నెలకు రూ.20 వేలు గౌరవ వేతనం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించాలన్నారు. బొడ్డు రాములు, శ్రీనివాస్, వారాల దేవయ్య, శంకరయ్య, లక్ష్మీనారాయణ, సోమినేని బాలు తదితరులు ఉన్నారు.

లాయర్లపేట

సండే స్పెషల్



గంభీరావుపేట(సిరిసిల్ల): ఆ పల్లె ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. పంటల సాగులోని కష్టనష్టాలు తెలుసు. అవేమి వారి పిల్లలు పడకూడదని ఉన్నత చదువులు అందించారు. ఇంజినీరింగ్, మెడిసిన్ కోర్సులే కాకుండా న్యాయవిద్య చదువుతున్నారు. ఇప్పటికే గ్రామంలో ఇద్దరు జడ్జీలు, 30 మంది లాయర్లు, మరో 10 మంది వరకు క్లర్క్‌లుగా కోర్టులలో ఉద్యోగాలు చేస్తున్నారు. నల్లకోటు ధరించే వారి సంఖ్య గ్రామంలో అత్యధికంగా ఉండడంతో గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట కాస్త లాయర్లపేటగా స్థానికులు పిలుచుకుంటున్నారు. ఆ గ్రామ విశేషాల్లో ఓసారి పరిశీలిద్దాం..

- లింగన్నపేటలో 30 మంది అడ్వకేట్లు
- ఇద్దరు జడ్జీలు.. 10 మంది క్లర్క్‌లు
- హైకోర్టు న్యాయవాదులుగా గ్రామస్తులు

జిల్లా కేంద్రానికి సుదూరంగా..

జిల్లా కేంద్రానికి 35 కిలోమీటర్ల దూరంలో లింగన్నపేట ఉంటుంది. గ్రామంలో దాదాపు 6వేల జనాభా ఉంటుంది. గ్రామస్తులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. చదువు విలువను గుర్తించిన ఆ గ్రామస్తులు తమ పిల్లలకు ఉన్నత విద్యనందించారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వైద్యులతోపాటు అత్యధిక సంఖ్యలో లాయర్లు ఉన్నారు. 30 మంది లాయర్లు, 10 మంది క్లర్క్‌లు కోర్టుల లో పనిచేస్తున్నారు. ఇద్దరు న్యాయమూర్తులు(జడ్జీలు) ఇందిర, శ్రీనివాస్‌రావు కూడా ఉన్నారు. ఇదే ఊరుకు చెందిన రాంచందర్‌రావు అనే న్యాయవాది గతంలో ప్రభుత్వ అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. కాగా, మొట్టమొదటిసారిగా లింగన్నపేట నుంచి పి.లింగారావు అనే వ్యక్తి లాయర్ వృత్తిచేపట్టారు. ఆయన చూపినబాటలో ప్రస్తుతం వీరంతా సాగుతున్నారు. అందరివి వ్యవసాయ కుటుంబాలే. గ్రామంలో వీరికి సాగు భూములు కూడా ఉన్నాయి. సెలవుల్లో, పండుగ రోజుల్లో, బంధువుల ఇళ్లలో జరిగే శుభకార్యాల సందర్భంలో లాయర్లు లింగన్నపేటకు వస్తుంటారు. న్యాయపరమైన సమస్యల పరిష్కారంలో గ్రామస్తులకు చేదోడువాదోడుగా ఉంటున్నారు.


లింగన్నపేట గ్రామం

గర్వంగా చెప్పుకుంటాం



మా ఊరు లింగన్నపేట నుంచి దాదాపు 30 మంది లాయర్లు, ఇద్దరు జడ్జీలు, క్లర్క్‌లు ఉండడం మాకు సంతోషంగా ఉంటుంది. అప్పుడప్పుడు గర్వంగా చెప్పుకుంటాం. సాధారణ వ్యవసాయ కుటుంబాల నుంచి లాయర్లుగా ఎదిగి, హైదరాబాద్‌లో స్థిరపడ్డ వారు ఉన్నారు. వీలైనప్పుడు ఊరికి వస్తుంటారు. గ్రామస్తులకు కూడా సహాయ సహకారాలు అందిస్తుంటారు.

– లింగన్నగారి దయాకర్‌రావు, గ్రామస్తుడు

పాతికేళ్లుగా న్యాయవాద వృత్తిలోనే..



మాది లింగన్నపేట. నేను 1998 నుంచి న్యాయవాదిగా పనిచేస్తున్నాను. మాది సాధారణ వ్యవసాయ కుటుంబం. వృత్తిరీత్యా హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో స్థిరపడ్డాను. గతంలో హైకోర్టులో పనిచేశాను. ప్రస్తుతం రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కోర్టులలో పనిచేస్తున్నాను. బోడుప్పల్ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా 2023 నుంచి పనిచేస్తున్నాను. మున్సిపల్‌కు సంబంధించి న్యాయపరమైన అంశాలను నేనే చూసుకుంటున్నాను.

– యామన్నగారి అర్జున్‌రావు, న్యాయవాది

37 ఏళ్లుగా పనిచేస్తున్నా



మాది లింగన్నపేట గ్రామం. నేను 37 ఏళ్లగా క్లర్క్‌గా పనిచేస్తున్నాను. మా ఊరి నుంచి చాలా మంది లాయర్లు, క్లర్క్‌లు ఉన్నారు. క్లర్క్‌లుగా పనిచేసి లాయర్లు అయిన వారు కూడా ఉన్నారు. ఈ వృత్తిలో కొనసాగడం సంతృప్తికరంగా ఉంది. వీలైనంతగా మా ఊరి వాళ్లకు న్యాయపరమైన సలహాలు, సూచనలు అందిస్తుంటాం.

– లింగన్నగారి సురేందర్‌రావు, క్లర్క్

ఫిషరీస్ చైర్మన్‌ను కలిసిన నాయకులు


ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్‌తో తంగళ్లపల్లి నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను శనివారం తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ నాయకులు కలిశారు. సాయికుమార్‌ను శాలువాతో సన్మానించారు. జిల్లా ఫిషరీస్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్, నాయకులు లింగాల భూపతి, సుద్దాల శ్రీనివాస్ ఉన్నారు.

పని వేళల మార్పు ఆమోదయోగ్యం

సిరిసిల్లఎడ్యుకేషన్: పాఠశాలల్లో పని వేళల మార్పు అందరికీ ఆమోదయోగ్యమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రం శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉదయం 9 గంటలకు పాఠశాలల ప్రారంభం కావడం వల్ల విద్యార్థులు అభ్యసన చేసే సమయంలో ప్రశాంతంగా ఉంటుందన్నారు. అలాగే సాయంత్రం 4.15 గంటలకు బయలుదేరి త్వరగా ఇంటికి వెళ్లేందుకు అవకాశం ఉంటుందని, విద్యార్థులు చదివిన వాటిని తల్లిదండ్రులు పరిశీలించేందుకు సమయం దొరుకుతుందని పేర్కొన్నారు. రాష్ట్రమంతా ఒకే విధమైన పని వేళలుండడం మంచిదన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ


ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మున్నూరుకాపులు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- గంభీరావుపేట మున్నూరుకాపుల ఆత్మీయ సత్కారం

గంభీరావుపేట(సిరిసిల్ల): అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని, రైతులు ఆందోళన చెందొద్దని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గంభీరావుపేట మండల మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆది శ్రీనివాస్‌కు శనివారం ఆత్మీయ సత్కారం నిర్వహించారు. విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఆర్థిక తోడ్పాటునందించాలనే రుణమాఫీ ప్రక్రియ చేపట్టిందని తెలిపారు. త్వరలోనే రైతుభరోసా అందిస్తామన్నారు. దున్నేవాడికే రైతు భరోసా అందించాలనే అభిప్రాయాలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. మున్నూరుకాపులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగాలని కోరారు.

విద్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పిస్తాం

ప్రభుత్వ విద్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పిస్తామని విప్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గంభీరావుపేటలోని కేజీబీవీని పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ప్రత్యేకాధికారి వసంతకు సూచించారు. సరిపడ టాయిలెట్స్ లేక ఇబ్బంది పడుతున్నామని విద్యార్థినులు తెలపగా.. త్వరలోనే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మున్నూరుకాపు సంఘం మండలాధ్యక్షుడు కూర సురేశ్, జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, నాయకులు కొమిరిశెట్టి తిరుపతి, దుమాల శ్రీకాంత్, గడ్డం నర్సయ్య, గంట అశోక్, నంది కిషన్, బండారు బాల్‌రెడ్డి, అగ్గిరాములు, మల్లేశం, కిరణ్‌కుమార్, మాజీ సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షులు కొమిరిశెట్టి తిరుపతి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, పట్టణ శాఖ ఉపాధ్యక్షుడు పాపగారి రాజుగౌడ్ ఉన్నారు.

జీపీ కార్మికుల హామీలు నెరవేర్చాలి



సిరిసిల్లటౌన్: గ్రామపంచాయతీ కార్మికుల హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేసి, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. వర్కర్లు మల్లయ్య, బుర్ర శ్రీనివాస్, అంజయ్య, గంగరాజు, మహేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

- లోకల్‌యాప్‌లో ప్రకటనలు
- ఐదుగురు అంతర్‌రాష్ట్ర నిందితులు అరెస్ట్
- ల్యాప్‌టాప్, 5 మొబైళ్లు సీజ్
- బ్యాంక్ ఖాతాల నిలిపివేత
- ఎస్పీ అఖిల్ మహాజన్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికిన ఐదుగురు అంతర్‌రాష్ట్ర సైబర్ మోసగాళ్లను రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు శనివారం అరెస్ట్ చూపారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ వెల్లడించిన వివరాలు. ట్రెండ్జ్ ఇండియా కార్పొరేషన్ నెట్‌వర్క్ కంపెనీ పేరుతో ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌కు చెందిన ఎర్రబుద్ధి గోపి, కురుబా అశోక్‌కుమార్, మాదిగ బ్రహ్మేంద్ర, సత్యసాయి పుట్టపర్తి జిల్లా పరిగి మండలం సెయ్యిపల్లికి చెందిన మాదిగ స్వాతిసంజీవప్ప, సోమందేపల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన కురుబ వరలక్ష్మి అనే ఐదుగురు సైబర్ మోసాలకు పాల్పడ్డారు. ఎర్రబుద్ధి గోపి ట్రెండ్జ్ ఇండియా కార్పొరేషన్ నెట్‌వర్క్ పేరుతో డమ్మీ కంపెనీని క్రియేట్ చేశాడు. ఉద్యోగావకాశాలు కల్పిస్తామని అనంతపూర్ జిల్లాలోని లోకల్‌యాప్‌లో ప్రకటనలు ఇచ్చారు. హెల్త్‌కేర్, పర్సనల్ కేర్, హోమ్‌కేర్, ఫ్యాషన్‌కేర్, గోల్డ్ అండ్ డైమండ్స్ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయిస్తామని.. ఇందుకు యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికారు. ఇదే కంపెనీలో ముందుగా పని కుదుర్చుకున్న అశోక్, వరలక్ష్మి, బ్రహ్మేంద్ర, స్వాతిలతో ప్రకటనలు తయారు చేయించాడు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామంటూ వారితో ఆ ప్రకటనల్లో మాట్లాడించి నమ్మకం కలిగించేలా చేశాడు. ఉద్యోగులుగా జాయిన్ అయిన వారి నుంచి రూ.10 వేలు తీసుకొని కంపెనీ గుర్తింపుకార్డు ఇవ్వడంతోపాటు మరి కొంతమందిని కంపెనీలో చేర్పించాలంటూ మోసాలకు తెరలేపాడు. కమీషన్ తోపాటు ముందుగా డబ్బులు చెల్లించిన వారికి రూ.వెయ్యి విలువైన వస్తువులను ఇచ్చాడు. ఇలా సిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన దూస రమ్య ఆ ప్రకటన చూసి ఉద్యోగం కావాలని వారికి మెసేజ్ చేయగా.. వెరిఫికేషన్ కోసం రూ.400 అడిగారు. ఆ మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా పంపడంతో జాబ్ వచ్చిందని, గుర్తింపుకార్డు కోసం రూ.5వేలు కావాలనడంతో ఆ సొమ్మును సైతం పంపింది. ఆమెకు మార్కెటింగ్‌లో తమ కంపెనీకి సంబంధించిన వస్తువులు విక్రయించాలని చెప్పడంతో రమ్య నిలదీసింది. అయితే మరో రూ.5వేలు ఇస్తే ఇంకో మంచి ఉద్యోగం చూస్తామనడంతో వారి మాటలు నమ్మిన రమ్య ఆ డబ్బును సైతం పంపింది. అప్పటి వరకు ఆమెతో మాట్లాడిన సదరు వ్యక్తులు అనంతరం ఫోన్ చేస్తే సమాధానం ఇవ్వడం మానేశారు. మోసపోయానని గుర్తించిన బాధితురాలు సిరిసిల్ల పోలీ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన సిరిసిల్లటౌన్, సైబర్‌సెల్ పోలీసులు శుక్రవారం రాత్రి నిందితులను అనంతపూర్ జిల్లాలో నిశారదానగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక ల్యాప్‌టాప్, ఐదు మొబైళ్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. నిందితులను శనివారం సిరిసిలలో అరెస్ట్ చూపారు. ఇదే కంపెనీపై అనేక ఫిర్యాదులు ఉన్నాయని వాటిపై కేసు నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు.

కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం


పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న 'ఆరు గ్యారంటీ'లను అర్హులకు అందించే లక్ష్యంతో కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవాకేంద్రాన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. కలెక్టరేట్‌లోని ప్రజాపాలన సేవా కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీల్లోని వంటగ్యాస్ సిలిండర్ రాయితీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అర్హులైన ప్రతీ కుటుంబానికి అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏ కారణంతోనైనా అర్హత ఉన్నా.. ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పొందలేకపోతున్న వారు ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సందర్శించి లోటుపాట్లు ఉంటే సరిచేయించుకోవచ్చని వివరించారు. కలెక్టరేట్‌లో ఈ సేవా కేంద్రం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుందని తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతోపాటు అన్ని మండల కేంద్రాల్లోని ఎంపీడీవో ఆఫీస్‌ల్లోనూ ప్రజాపాలన సేవా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. ప్రజాపాలన సేవాకేంద్రాలకు వచ్చే వారు తమ వెంట రేషన్‌కార్డ్, ఆధార్ కార్డు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నంబర్, గ్యాస్ కనెక్షన్ నంబర్, ఎల్పీజీ కస్టమర్ ఐడీ, మొబైల్ నంబర్ తమ వెంట తీసుకురావాలని సూచించారు. ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్, డీపీఆర్వో వంగరి శ్రీధర్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీపై రైతుల క్షీరాభిషేకం



ముస్తాబాద్/కోనరావుపేట: రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లెలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులు, కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు కుమార్, బాలయ్య, ఫయాజ్, శంకర్, కనకయ్య, ఇస్తారి ఉన్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మల్లేశం, ప్రేమ్‌చంద్, సాగర్, రాములు, రాంరెడ్డి, అమృతరావు, సంజీవరావు, ఉస్మాన్, మల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, వేణురెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐలకు ఆధార్ తప్పనిసరి కాదు

- చార్టర్డ్ అకౌంటెంట్ ఎం.సంతోష్‌రెడ్డి
- 'సాక్షి'తో పలు వివరాలు వెల్లడి



సిరిసిల్ల : విదేశాల్లో స్థిరపడి ఆదాయం పొందుతూ.. పుట్టి పెరిగిన ప్రాంతాల్లో ఆస్తులు సంపాదించే వారు ఎందరో ఉన్నారు. బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లడం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పరిపాటి. కానీ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లి.. అక్కడే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, భవన నిర్మాణ రంగాల్లో స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐ (ప్రవాస భారతీయులు) చాలా మంది ఉన్నారు. వీరంతా ప్రతీ నెల ఇక్కడే ఉంటున్న తమ కుటుంబ సభ్యులకు డబ్బులు పంపిస్తుంటారు. అయితే వారంతా మన వద్ద ఆదాయపన్ను చెల్లించాల్సి ఉంటుందా? ఎంతమేరకు చెల్లించాలి? విదేశాల నుంచి ఏడాదిలో గరిష్టంగా ఎంతమేరకు పంపవచ్చు? ఎన్‌ఆర్‌ఐలకు ఆధార్‌కార్డు ఉండాలా? వంటి ప్రశ్నలకు కరీంనగర్‌కు చెందిన ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ ఎం.సంతోష్‌రెడ్డి 'సాక్షి'తో మాట్లాడారు.

ఎంత సొమ్ము అయినా పంపించవచ్చు

ఉద్యోగ, ఉపాధి కోసం వివిధ దేశాల్లో స్థిరపడ్డ ఎన్‌ఆర్‌ఐలు ఇండియాలో ఉన్న రక్తసంబంధీకులకు ఎంత మొత్తంలోనైనా డబ్బులు పంపవచ్చు. దీనికి ఆర్‌బీఐ సీలింగ్ ఏమి విధించలేదు. ఇది మంచి ట్యాక్స్ ప్లానింగ్ అంశం. ఆదాయ పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు. విదేశాల్లో చదువులకు, ట్రీట్‌మెంట్‌కు, అప్పులకు, అవసరాలకు డబ్బులు పంపవచ్చు. ఒక వేళ ఇండియాలోని స్థిరాస్తులను విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బులను ఎన్‌ఆర్‌ఐలు విదేశాలకు తీసుకెళ్లవచ్చు. కానీ ఒక్క ఆర్థిక సంవత్సరంలో ఒక్క మిలియన్ యూఎస్ డాలర్లు (అంటే రూ.8కోట్ల)కు మించి తీసుకెళ్లడానికి అవకాశం లేదు.

వ్యవసాయభూములు కొనరాదు

భారతీయ చట్టాల ప్రకారం ఎన్‌ఆర్‌ఐలు ఇండియాలో వ్యవసాయ భూములు కొనరాదు. ఇతర స్థిరాస్తులు కొనుగోలు చేయవచ్చు. ఇండియా వ్యవసాయాధారిత దేశం కావడంతో ఎన్‌ఆర్‌ఐలు వ్యవసాయ భూములు కొంటే.. పడావులుగా ఉంచుతారని, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తారని ఈ నిబంధనలు పెట్టారు. కానీ వారసత్వంగా వచ్చే వ్యవసాయ భూములను వారి పేరిట మార్చుకోవచ్చు, వాటిని అనుభవించవచ్చు.

పన్ను చెల్లించాలి

ఏటా రూ.3లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్న ఎన్‌ఆర్‌ఐలు తప్పనిసరిగా ఆదాయపన్ను రిటర్న్ ఫైల్ చేయాలి. ఎన్‌ఆర్‌ఐలకు ఇండియాలో సాధారణంగా స్థిరాస్తులపై అద్దె, ఎన్‌ఆర్‌వో అకౌంటర్‌లో వడ్డీ, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ నుంచి డెవిడెండ్, షేర్ మార్కెట్ ట్రేడింగ్ లాభాలు వంటి ఆదాయాలపై పన్నులు చెల్లించాల్సిందే. ఒక్కోసారి ఎన్‌ఆర్‌ఐలకు ఇండియన్ కంపెనీల నుంచి జీతాలు వస్తుంటాయి. ఇలాంటి ఆదాయం రూ.3 లక్షలు దాటితే ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఒక వేళ ఎన్‌ఆర్‌ఐలకు ఇండియాలో ట్యాక్స్ పరిధిలోకి వచ్చే వ్యవహారం ద్వారా పేమెంట్ చేయాల్సి వస్తే ఫామ్ 15సీఏ/15 సీబీ ఫైల్ చేస్తేనే బ్యాంకర్ డబ్బులు ఎన్‌ఆర్‌ఐకి పంపించడం జరుగుతుంది. ఏమైనా సందేహాలు ఉంటే సీఏను సంప్రదించాలి.

పన్ను చెల్లించకుంటే శిక్ష

ఆదాయపన్ను చట్టం 1961 ప్రకారం ఎన్‌ఆర్‌ఐలకు ఇండియాలో పన్నులు చెల్లించే ఆదాయం ఉండి కూడా రిటర్నులు ఫైల్ చేయకుంటే శిక్షార్హులు అవుతారు. వడ్డీలు, పెనాల్టీలతో సహా డిమాండ్ నోటీస్ అందిస్తారు. దానికి స్పందించకపోతే ఎన్‌ఆర్‌ఐలకు చెందిన ఇండియాలోని బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్ చేస్తారు. స్థిరాస్తులను అటాచ్ చేస్తారు. ఎన్‌ఆర్‌ఐ నివసించే దేశంలోని మన ఎంబసీ ద్వారా చర్యలు తీసుకుంటారు.

పాన్‌కార్డు ఉండాలి

ఇండియాలో ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలంటే తప్పనిసరిగా పాన్‌కార్డు ఉండాలి. ఎన్‌ఆర్‌ఐకి ఆధార్‌కార్డు తప్పనసరి కాదు. ఆధార్‌కార్డు కావాలంటే.. ఇండియన్ అడ్రస్‌తో సరైన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవచ్చని యూఐడీఏఐ నిబంధనలు చెబుతున్నాయి.

పెండింగ్ బిల్లులు ఇప్పించండి

- ప్రభుత్వ విప్‌కు తాజామాజీ సర్పంచ్‌ల జేఏసీ విన్నపం


ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి విన్నవిస్తున్న తాజామాజీ సర్పంచ్‌లు

వేములవాడ: 2019 నుంచి 2024 వరకు గ్రామాల్లో తాము చేపట్టిన అభివృద్ధి, ప్రజా అవసరాల పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇప్పించాలని కోరుతూ తాజా, మాజీ సర్పంచ్‌ల జేఏసీ శనివారం రాత్రి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి విన్నవించింది. ఈ సందర్భంగా తాజా, మాజీ సర్పంచుల జేఏసీ నాయకులు మాట్లాడారు. అప్పులు చేసి, ఆస్తులను అమ్ముకుని గ్రామాల్లో వసతులు కల్పించామన్నారు. తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించేందుకు ప్రభుత్వంతో మాట్లాడాలని విన్నవించారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తానని విప్ హామీ ఇచ్చారు. అధ్యక్షుడు కరుణాకర్, ఉపాధ్యక్షులు శివజ్యోతి, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి వంశీకృష్ణ, కార్యదర్శి రాంరెడ్డి, నారాయణ, సంయుక్త కార్యదర్శులు వేణుగోపాల్‌రావు, కోల నర్సయ్య, కార్యవర్గ సభ్యులు నందయ్య, శ్రీనివాస్, మనోహర్, కేశవరావు, ఎల్లం, సంతోష్‌రెడ్డి, తిరుపతి, రవీందర్, సుమతి, నర్సింహారెడ్డి, రవినాయక్, దినాకర్, రాములు, మల్లేశం, గజన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వవిప్‌ను కలసిన డిపో మేనేజర్

వేములవాడ: ఆర్టీసీ వేములవాడ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ శనివారం ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రయాణికులకు కావాల్సిన సౌకర్యాలు అందించాలని విప్ మేనేజర్‌కు సూచించారు.